# ఉపోద్ఘాతము

అబ్రాహాము సంతతివారు 400 సంవత్సరములు పరదేశములో దాసులుగా యుందురనియు, తరువాత వారు తమ దేశమునకు తిరిగి వచ్చెదరనియు దేవుడు తన స్నేహితుడైన అబ్రాహాముతో చెప్పెను (ఆది కాం. 15:13-16). కనాను దేశములో వచ్చిన కరువు మూలముగా యాకోబు, ఆయన సంతతి వారందరు ఐగుప్తునకు వెళ్ళిరి. అక్కడ వారు విస్తరించి గొప్ప జనాంగమైరి. వారు ఒక బలమైన జనాంగమని ఫరో గుర్తించిన వాడై వారిని తనకు బానిసలుగా చేసికొనెను. వారు అనేక శ్రమల పాలైరి. ఆ సమయములో వారు దేవునికి మొర పెట్టిరి. దేవుడు అబ్రాహాముతో తాను చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేసికొని, ఐగుప్తు దాస్యమునుండి ఇశ్రాయేలు ప్రజలను విడిపించుటకు మోషేను పంపెను. ఆయన చెప్పిన మాట ప్రకారము అనేక మహత్కార్యములను, సూచక క్రియలను జరిగించి ఐగుప్తీయుల మీదికి తెగుళ్ళు పంపి, ఇశ్రాయేలీయులను ఐగుప్తులో నుండి విడిపించెను. వారు ఐగుప్తును విడచి వాగ్దాన దేశమునకు ప్రయాణము గావించిరి. వారి ప్రయాణమును గూర్చి లేఖనములలో చదివెదము. వారు ఐగుప్తును విడచినప్పటికిని, ఐగుప్తు వారిలోనుండి పోలేదు. పాత జీవితమునకు, దాసత్వమునకు తిరిగి వెళ్ళిపోవలెననెడి మనస్తత్వమునే వారు కలిగియుండిరి. మనము కూడ ఇటువంటి స్వభావమునే కలిగియున్నాము. దాసత్వములో నుండి మనలను విడిపించుటకు ప్రభువు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికిని, ఏదో ఒక రీతిగా తిరిగి దాసత్వములోనికి వెళ్ళెదము. ఇశ్రాయేలు ప్రజలయొక్క

ప్రయాణముల ద్వారా మనమెన్నో ప్రశస్తమైన పాఠములను నేర్చుకొనెదము. ఐగుప్తు నుండి కనానునకు దేవుని ప్రజల ప్రయాణమును గూర్చి చదువునప్పుడు ఐగుప్తు దాసత్వమునకు, అంధకారమునకు, శాపమునకు సూచనయై యున్నదని గ్రహించెదము. దేవుని కృపద్వారా రక్షింపబడినప్పుడు ప్రతివిధమైన దాసత్వమునుండి, బానిసత్వము నుండి, శాపము నుండి విడిపింపబడెదము. ఆయన పరిపూర్ణతలోనికి మనము రావలెననియే ప్రభువు కోరుచున్నాడు. కనాను దేశము ఆ పరిపూర్ణతను సూచించుచున్నది. మార్గములో మనము ఎదుర్కొను నానావిధమైన పరీక్షలను, పరిశోధనలను, జయించితేనే తప్ప ఆ పరిపూర్ణతను అనుభవించలేము. యేసుక్రీస్తు ప్రభువు సిలువలో ముగించిన కార్యమునందు విశ్వాసముంచిన క్షణములోనే మన పాపములు క్షమింపబడును. ఆ విశ్వాసము ద్వారానే నూతన జన్మమును పొందెదము. అయితే దేవుని పరిపూర్ణతను అనుభవించు విషయము మన విధేయత, నమ్మకత్వము మీద ఆధారపడియుండును. అందువలననే అరణ్యమార్గము ద్వారా మనము వెళ్ళవలయును. మన విశ్వాసము సజీవమైనదో, లేదో అను విషయము పరీక్షింపబడవలెను.

ఆ ప్రయాణము ద్వారా మనము ఎన్నో పాఠములు నేర్చుకొనగలము. తరువాత ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతమునకు చేరిరి. అక్కడ ధర్మశాస్త్రము మోషే ద్వారా యివ్వబడెను. ఏ ఉద్దేశముతో ఈ ధర్మశాస్త్రము యివ్వబడెనో చూచెదము.

# ధర్మశాస్త్రము యొక్క అర్థము

దేవుని వాక్యములో నుండి ధర్మశాస్త్రమనగా ఏమో చూచెదము. "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1:17). " విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు. ధర్మశాస్త్ర మూలమగు నీతిని నెరవేర్చువాడు దానివలననే జీవించునని మోషే వ్రాయుచున్నాడు" (రోమా 10:4,5). మోషే ఇశ్రాయేలు ప్రజలకాజ్ఞాపించిన ఆజ్ఞలు, కట్టడలు, పండుగలు, బలులు మొదలగునవన్నియు కలిసి "ధర్మశాస్త్రము" అని పిలువబడుచున్నది. ఈ ధర్మశాస్త్రము దేవుడు, మానవుని యొద్దనుండి ఎట్టి నీతిని కోరుచున్నాడో తెలుపుచున్నది. ఏ మానవుడును తన స్వంత ప్రయత్నములద్వారా ఈ నీతిని పొందలేడు. సబ్బాతు నాచరించువారు పది ఆజ్ఞలు ధర్మశాస్త్రములోనివి కావనియు, ఆ పది ఆజ్ఞలు ప్రత్యేకమైన భాగమనియు చెప్పెదరు. ఆ రీతిగా వారు తలంచి, ధర్మశాస్త్రము అంతరించినను, పది ఆజ్ఞలు మాత్రము ఆచరణలో యుండునని వాదించెదరు. ఆచారములు, విధులకు సంబంధించిన చట్టములు, నైతిక జీవితమునకు సంబంధించిన చట్టములు అని వేరు చేయుదురు. ఆచారములు, విధులు మొదలైనవి అచరించనవసరము లేదు గాని నైతిక జీవితమునకు సంబంధించిన చట్టములుయింకను అమలులోనే యుండునని తర్కించెదరు. ఇట్టి వ్యత్యాసము బైబిలులోనున్నట్లు మనము కనుగొనము.

ధర్మశాస్త్రోపదేశకుడు యేసుప్రభువు నొద్దకు వచ్చి ఆయనను ప్రశ్నించినప్పుడు, అజ్ఞలు కూడా ధర్మశాస్త్రము లోనివేనని ప్రభువు చెప్పెను. మత్తయి 22:34-40లలో ఇట్లు చదివెదము: "ఆయన సద్దూకయ్యుల నోరు మూయించెనని పరిసయ్యులు విని కూడి వచ్చిరి. వారిలో ఒక ధర్మశాస్త్రోపదేశకుడు ఆయనను శోధించుచు, బోధకుడా, ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని అడిగెను. అందుకాయన - నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు, మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమైయున్నవని అతనితో చెప్పెను".

పరిసయ్యులకు, సద్దూకయ్యులకు సమాధానము చెప్పుచు ప్రభువు ధర్మశాస్త్రమంతటిని "ధర్మశాస్త్రము, ప్రవక్తలు" అని రెండు భాగములుగా చేసెను. "మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భాగము వారికి తెలిపెను" (లూకా 24:27). ప్రభువు ఆ రెండు భాగములను "మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథములు" అని చెప్పెను. సీనాయి కొండమీద దేవుడు మోషే కిచ్చిన పది ఆజ్ఞలు, అనుదిన జీవితమునకైన విధులు, ప్రత్యక్ష గుడారములోని బలులు, యెహోవా పండుగలు - యివన్నియు కలసి ధర్మశాస్త్రము అయ్యెను. కాని పది ఆజ్ఞలు ప్రత్యేకమైన ధర్మశాస్త్రము కాదు. బలులు, సున్నతి మొదలగువాటి నుండి పది ఆజ్ఞలు ప్రత్యేకింపబడలేదు.

ధర్మశాస్త్రోపదేశకుడు అడిగిన ప్రశ్నను జాగ్రత్తగా గమనించుడి. "ధర్మశాస్త్రములో ముఖ్యమైన అజ్ఞ ఏది?" అని అడిగెను. ప్రభువు యిచ్చిన ప్రత్యుత్తరమును గమనించుడి. "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననుదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను". ద్వితీ. కాం. 6:5; లేవీ. కాం. 19:18లలో ఈ విషయములు వ్రాయబడెను. కనుకనే పది ఆజ్ఞలు ధర్మశాస్త్రములోనివే కాని ప్రత్యేకమైనవి కావు.

పౌలు ధర్మశాస్త్రమును గూర్చి మాట్లాడునప్పుడు "ధర్మశాస్త్ర గ్రంథము" అని చెప్పెను. "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధించినవారందరు శాపమునకు లోనై యున్నారు. ఎందుకనగా ధర్మ శాస్త్రమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలకడగా ఉండని ప్రతివాడు శాపగ్రస్తుడు" అని వ్రాయబడియున్నది. అంతేగాక దినములు, మాసములను, ఆచరించు విషయము కూడ వ్రాయబడెను. "మీరు దినములను, మాసములను, ఉత్సవ కాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు" (గలతీ 4:10). కనుక ఆచారములు, విధులను గూర్చిన కట్టడలు, నైతిక నియమములు కాదని పౌలు కూడ చెప్పెను.

నిర్గమకాండము 19 నుండి 22 అధ్యాయములలో మోషే సీనాయి కొండకు వెళ్ళి అక్కడ దేవుని ఆజ్ఞలను పొందెను. అన్ని విషయముల కొరకై అవసరమైన ఉపదేశమును పొందెను. నిర్గమకాండము 20:1-7లలో పది ఆజ్ఞలను గూర్చియు, మిగిలిన చట్టములు, నియమములను గూర్చి చదివెదము. కనుక పది ఆజ్ఞలు ధర్మశాస్త్రములోనివేగాని వేరుగా లేవు.

సబ్బాతు నాచరించువారు నిర్గమ కాం. 20:10ని గూర్చి చెప్పెదరు. "ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను, నీ కుమారుడైనను, నీ కుమార్తెయైనను, నీ దాసుడైనను, నీ దాసియైనను, నీ పశువైనను, నీ యిండ్లలో నున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు". ఈ వాక్యమును చూపించి మనతో యిట్లనెదరు, 'ఈ ఆజ్ఞ మాట ఏమిటి? మీరు పది ఆజ్ఞలను పాటించుచున్నారా? సబ్బాతు నాచరించుచున్నారా? మీ రక్షణ కొరకై మీరు శనివారమును పాటించవలెను. లేనట్లయితే మీరు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించుచున్నారు. మీరు దేవుని తీర్పులోనికి వచ్చెదరు' అని చెప్పెదరు. ప్రభువైన యేసుక్రీస్తు సబ్బాతు నాచరించెననియు, దానిని మార్చలేదనియు వారు చెప్పెదరు. ఈ రీతిగా చెప్పు వీరు నాగరికులైన అబద్ధికులు. వారియొక్క మోసకరమైన, హానికరమైన బోధలద్వారా ప్రజలను తప్పుగా నడిపించి, తిరిగి దాస్యములోనికి తీసికొని వెళ్ళెదరు. వారు ఎవరో అను విషయమును చెప్పరు. ఎంతో యుక్తిగా వారి నిజ స్వరూపమును దాచుకొని 'వాయిస్ ఆఫ్ ప్రొఫెసీ' అను పేరుతో ముద్రించబడిన బైబిలు ఉత్తర ప్రత్యుత్తరములను

ప్రతివారము పంపుచు ప్రజలను త్రిప్పుకొనుచున్నారు. బైబిలు పఠనములు అను ఈ కోర్సును పంపుటద్వారా ప్రజలు దీనియందు ఆసక్తి చూపుచున్నారు. అయితే వారి ఉద్దేశము ప్రజలను సబ్బాతు నాచరించునట్లు చేయుటయే.

# ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశము

దేవుడు ధర్మశాస్త్రమును మనకేల నిచ్చెనో చూచెదము. ప్రథమముగా దేవుడు చెప్పినట్లుగా పాపము అనగా ఏమో ప్రజలు గ్రహించునట్లు దేవుడు ధర్మశాస్త్రము నిచ్చెను. పాపము యొక్క నిర్వచనమును ప్రజలు తెలిసికొనునట్లు అది యివ్వబడెను. "ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది" (రోమా 3:20).

రెండవదిగా, దేవునియొక్క పరిశుద్ధతను గ్రహించుటకై ధర్మశాస్త్రము యివ్వబడినది. "ప్రతి నోరు మూయబడునట్లును, సర్వలోకము దేవుని శిక్షకు పాత్రమగునట్లును, ధర్మశాస్త్రము చెప్పుచున్న వాటినన్నిటిని ధర్మశాస్త్రమునకు లోనైన వారితో చెప్పుచున్నదని యెరుగుదుము" (రోమా 3:19). ఏది సరియైనదో ఏది తప్పో ధర్మశాస్త్రము తెలుపుచున్నది. ధర్మశాస్త్రము ద్వారా మంచి ఏదో, చెడు ఏదో ప్రజలు తెలిసికొనుచున్నారు. అయితే పాపము చేయకూడదని

వారు ప్రయత్నించినప్పుడు పాపములో పడిపోవుచున్నారు. మానవ శక్తిద్వారా ఏ వ్యక్తి కూడ దేవుని ఆజ్ఞలను నెరవేర్చలేడని ఒప్పుకొనక తప్పదు. ఈ రీతిగా లోకమంతయు, దోషపూరితమయ్యెను. దేవుని యెదుట ప్రతి నోరు మూయబడెను.

నేను ఎంతో మంచి వ్యక్తిగా వీధులలో నడువగలను, నిరాడంబర వ్యక్తిగా, అమాయకునిగా నేను ప్రజల యెదుట కనుపరచుకొనగలను. ఏలయనగా నేను ఎవరితోనైనను కలహించితిననిగాని, అబద్ధములు చెప్పితిననియైనను, దొంగిలించితిననియైనను ఎవరును, ఎప్పుడును వినలేదు. నేను మంచివాడనని చెప్పితే ప్రజలు నమ్మగలరు. అయితే దేవుని యెదుట నేనట్లు చెప్పజాలను. దేవుని చేయి నా నోటిని మూసివేయును. "నీవు మంచివాడవని నీవు ఎట్లు చెప్పకొనగలవు? నీవైపు చూచుకొనుము. నా పరిశుద్ధత ఎట్టిదో చూడుము" అని దేవుడు చెప్పను. నేను మనుష్యులను మోసగించగలను కాని దేవుని మోసగించలేను. ఈ రీతిగా ధర్మశాస్త్రము ద్వారా దేవుని పరిశుద్ధత అనగా ఏమో గ్రహించ గలిగితిమి.

అది ఎట్లు సంభవించెను? మోషే పర్వతము మీదకు వెళ్ళినప్పుడు పరలోకమునుండి అగ్ని ఆ పర్వతము మీదికి వచ్చెను, భూకంపము కలిగెను. ఎవరును దానిని సమీపించలేక పోయిరి. అగ్నిని చూచిన వెంటనే వారు వణకుచు యిట్లనిరి. "దేవుడు పరిశుద్ధుడు, ఆయన దహించు అగ్నియై యున్నాడు". దేవుడు మాట్లాడుచున్న స్థలమునకు వెళ్ళుటకు ఒకవేళ వారు ప్రయత్నించి యుండినట్లయినచో వారు దహించబడి, బూడిదై యుండెడివారు. ఆ అగ్నియే ఎవరును

సమీపించలేనంత పరిశుద్ధమైనదిగా నున్నట్లయినచో, దేవుని అగ్నిని నీవు ఎట్లు సమీపించగలవు? దేవుని పరిశుద్ధత అనగా ఏమో ఆ అగ్నిచూపించుచున్నది. కనుకనే దేవుడు, "పర్వతముమీది ఆ దర్శనముతో నిన్ను నీవు పోల్చుకొనుము. నీ చేతులను, పాదములను చూచుకొనుము. పరిశుద్ధుడవుగా కనిపించితే, నా అగ్నిని సమీపించుము" అని చెప్పుచున్నాడు. ఎవరును ఆ పర్వతము మీదకు వెళ్ళలేకపోయిరి. ఈ రీతిగా ప్రతి మనుష్యుని నోరు మూయబడుచున్నది.

మూడవదిగా, పాపము ఎంత భయంకరమైనదో తెలిసికొనుట కొరకై ధర్మశాస్త్రము యివ్వబడినది. "ఉత్తమమైనది నాకు మరణకరమాయెనా? అట్లనరాదు. అయితే పాపము ఉత్తమమైనదాని మూలముగా నాకు మరణము కలుగజేయుచు, పాపము పాపమైనట్టు అగుపడు నిమిత్తము అనగా పాపము ఆజ్ఞ మూలముగా అత్యధిక పాపమగు నిమిత్తము అది నాకు మరణకరమాయెను" (రోమా 7:13). పాపము ఎంత భయంకరమైనదో, ఎంత నాశనకరమైనదో, ప్రమాదకరమైనదోనను విషయము ధర్మశాస్త్రము ద్వారానే గ్రహింపగలుగుచున్నాము.

కొన్ని శతాబ్దముల క్రిందట క్షయరోగము అనగా ఏమో ప్రజలకు తెలియకుండెను. ఎందుకనగా క్షయరోగ బీజములు కంటికి కనిపించవు. ఎవరైనను విపరీతముగా దగ్గుచు బాధపడుచుండిన, అతనికి దయ్యము పట్టినదని భావించెడివారు. మంత్రశక్తులచే ఆ దయ్యమును విడిపించవలెనని ప్రయత్నించెడివారు. క్షయ ఒక వ్యాధియని గ్రహింపక దయ్యమనుకొనెడివారు. అయితే సూక్ష్మదర్శినిని (మైక్రోస్కోపు)

కనుగొనిన తరువాత క్షయరోగ బీజమును చూడగలిగిరి. సూక్ష్మదర్శిని ద్వారా ఆ సూక్ష్మజీవిని చూడగలిగినప్పుడు అది ఎంత నష్టమును, కీడును శరీరమునకు కలుగచేయునో గ్రహించగల్గిరి. ఇంతకుముందు అజాగ్రత్తగా నుండినవారు యిప్పుడు ఎంతో జాగ్రత్తగా యుండుచున్నారు. ఆ వ్యాధి యుండిన వ్యక్తికి సమీపముగా వెళ్ళుటకు కూడ భయపడెదరు.

పాపమును గూర్చి మనము చులకనగా తలంచెదము. "అది ఒక తలంపేకదా! కేవలము కోరికయే కదా! ఏదో భావోద్రేకము, అంతే! స్నేహము, ప్రేమకొద్దిగా కలసి తిరుగుట! అంతేకదా!" అని పాపమును గూర్చి తలంచుచున్నాము. కాని ఒక్క తలంపు ఎంత భయంకరమైనదో ప్రభువు తెలియజేయుచున్నాడు. ఒక తలంపుద్వారా కుటుంబములలో, జీవితములలో ఎంత నష్టము వాటిల్లుచున్నది! ఒక తప్పటడుగు ద్వారా ఎట్టి అంధకారము! పాపము యొక్క భయంకరత్వమును తెలియచేయుటకే ధర్మశాస్త్రము యివ్వబడినది.

నాల్గవదిగా, క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకే ధర్మశాస్త్రము యివ్వబడినది. "కాబట్టి మనము విశ్వాసమూలముగా నీతిమంతుల మని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను" (గలతీ 3:24). ధర్మశాస్త్రములో రక్షణలేదు. అది యెవరిని నీతిమంతులనుగా చేయలేదు. దేవుని సమీపించునట్లు కూడ చేయజాలదు. ధర్మశాస్త్రము అనగా బలులు, సున్నతి, ఆజ్ఞలు యివన్నియు యేసుక్రీస్తు ప్రభువు నొద్దకు మనలను నడిపించుటకు

మనలను సిద్ధపరచిన బాలశిక్షకునివలె యున్నవి. యేసు ప్రభువు వచ్చిన పిమ్మట బాలశిక్షకునితో యింక పనిలేదు. "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" (రోమా 10:4). క్రీస్తు ప్రభువే ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు. ధర్మశాస్త్రమును సమాప్తి చేయుటకే క్రీస్తు ఈ లోకమునకు వచ్చెనని దేవుని వాక్యము స్పష్టముగా చెప్పుచున్నది. మనము యిప్పుడు సున్నతి పొందనవసరము లేదు. సబ్బాతు నాచరించవలసిన అవసరము లేదు. బలులు అర్పించనక్కరలేదు. క్రియలద్వారా మనము నీతి మంతులము కాలేము కాని కృపద్వారానే, విశ్వాసము ద్వారా నీతిమంతుల మైతిమి. దేవుని వాక్యమును మార్చుటద్వారా ఈ సబ్బాతు నాచరించువారు దేవుని తీర్పుకు గురి అవుచున్నారు.

# కృప నుండి తొలగిపోవుట

క్రైస్తవ యుగారంభదినములలో ప్రజలు, సున్నతి చేయబడితేనే కాని లేక ప్రత్యేక దినముల నాచరించితేనే తప్ప రక్షింపబడరని వారికి బోధింపబడెను. "మీరు దినములను, మాసములను, ఉత్సవ కాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు" (గలతీ 4:10). అందువలననే అపొస్తలుడైన పౌలు వారు ఈ రీతిగా పాత పద్ధతులకు మళ్ళినట్లయిన సమస్తమును పోగొట్టుకొందురనియు, అతని ప్రయాసము వ్యర్థమైపోవు ననియు తలంచినవాడై కఠినముగా అతడు ఈ పత్రికను వ్రాసెను. పాత పద్ధతులకు మనలను మళ్ళించునట్లు చేయుట అపవాది ఆది నుండి ఉపయోగించు తంత్రమై యున్నది.

"మీ విషయమై నేను పడిన కష్టము వ్యర్థమై పోవునేమో అని మిమ్ములను గూర్చి భయపడుచున్నాను" (గలతీ 4:11).

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు కృపలోనుండి తొలగిపోయియున్నారు" (గలతీ 5:4). సున్నతి కాని లేక సబ్బాతు కాని లేక తదితర బలులు కాని ఆచరించువారు అనగా ధర్మశాస్త్రమును పాటించువారు కృపలోనుండి తొలగిపోయి యున్నారు. దేవుని కృపలోనుండి కొట్టివేయబడి యున్నారు. సబ్బాతు నాచరించువారు శిక్షావిధి క్రిందికి వచ్చుచున్నారు. వారి పుస్తకములు కాని, పత్రికలు కాని ఏమైనను ఉండినట్లయిన వాటిని పూర్తిగా కాల్చివేయుడి. ఎందుకనగా వారు మిమ్ములను కృపనుండి తొలగిపోవునట్లు చేయుదురు.

"ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" (గలతీ. 5:1). సున్నతి, సబ్బాతు, బలులు అనునవి ఆచరించుట ద్వారా తిరిగి దాస్యములో ప్రవేశించుచున్నామని పౌలు చెప్పుచున్నాడు. దీనిని గూర్చి పౌలు చాల కఠినముగా మాట్లాడుచున్నాడు. "చూడుడి; మీరు సున్నతి పొందిన యెడల క్రీస్తువలన మీకు ప్రయోజనమేమియు కలుగదని పౌలను నేను మీతో చెప్పుచున్నాను" (గలతీ 5:2). ప్రజలు ప్రార్థించినప్పటికిని, మరి ఏమి చేసినను దాస్యమను కాడిక్రింద యున్నంతవరకు క్రీస్తువలన ఏ ప్రయోజనము యుండదు.

"ధర్మశాస్త్రము యావత్తు అచరించ బద్ధుడైయున్నాడని సున్నతి పొందిన ప్రతి మనుష్యునికి నేను మరల దృఢముగ చెప్పుచున్నాను" అని గలతీ. 5:3లో పౌలు మరల చెప్పెను. అనగా నీవు సున్నతి అచరించినట్లయిన, ధర్మశాస్త్రమంతయు ఆచరింపవలసిన వాడవు. అందులో కొంచెము మాత్రము ఆచరించి, దానిని మాత్రమే అనుసరించజాలవు. నీవు సున్నతి లేక సబ్బాతు తప్పక ఆచరింపవలెనని కోరినట్లయిన ధర్మశాస్త్రమంతటిని నీవు ఆచరింపవలెనని పౌలు చెప్పుచున్నాడు. ప్రతివారము అపరాధ పరిహారార్థబలులను, సమాధాన బలులను ఆచరింపవలయును. మిగతా బలులను కూడ అర్పింపవలెను. అగ్ని ద్వారా అవి ప్రాయశ్చిత్తము చేయబడవలెను. కనుక సబ్బాతు నాచరించిన, ధర్మశాస్త్రమంతటిని ఆచరింపవలెనని పౌలు చెప్పుచున్నాడు.

నీవు యిట్లు చేయుటకు అనగా ధర్మశాస్త్రము పాటించుటకు యిష్టపడుదువా? ధర్మశాస్త్రమునకు బద్ధుడవై, బానిసగా యుండెదవా? లేక దానినుండి విడిపింపబడి విశ్వాసము ద్వారా జీవించెదవా?

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు. కృపలోనుండి తొలగిపోయి యున్నారు. ఏలయనగా మనము విశ్వాసము గలవారమై నీతి కలుగునను నిరీక్షణ సఫలమగునని ఆత్మద్వారా ఎదురు చూచుచున్నాము. యేసుక్రీస్తు నందుండు వారికి సున్నతి పొందుట యందేమియు లేదు పొందకపోవుట యందేమియు లేదు. కాని ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును. మీరు

బాగుగా పరుగెత్తుచుంటిరి. సత్యమునకు విధేయులు కాకుండ మిమ్మును ఎవడు అడ్డగించెను? ఈ ప్రేరేపణ మిమ్మును పిలుచుచున్నవాని వలన కలుగలేదు. పులిసిన పిండి కొంచెమైనను, ముద్ద అంతయు పులియచేయును" (గలతీ. 5:4-9).

నాల్గవ వచనమును గమనించుడి. పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియచేయును. తప్పుడు బోధ కొంచెమైనను మన సంతోషమును, సమాధానమును పాడుచేయగలదు. సబ్బాతు నాచరించువారిని మీ గృహముల లోనికి రానివ్వవద్దు. రేడియోల ద్వారా వెలువడువారి బోధలను వినవద్దు. 'వాయిస్ ఆఫ్ ప్రొఫెసీ' అను కార్యక్రమమును వినవద్దు. వీరు అపవాది సంబంధులు. అపవాది యొక్క దూతలు. చిరునగవుతో మీ యొద్దకు వచ్చెదరు. కేకు లేక ఏదైన బహుమతి లేక పటములు తీసికొని వచ్చెదరు. వారు ఎట్టి రూపములో వచ్చినను మీరు వారిని అంగీకరించవద్దు. ఎందుకనగా దేవుని కృపలోనుండి మిమ్మును తొలగించుటకే వారు వచ్చెదరు.

గలతీయలోని విశ్వాసులు సున్నతి నాచరించుచున్నారని, దినములు పాటించుచున్నారని పౌలు వినినప్పుడు ఒక స్త్రీ ప్రసవ వేదన పడినట్లు అతడు బాధపడెను. "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవ వేదన కలుగుచున్నది" (గలతీ. 4:19). "ఓ అవివేకులైన గలతీయులారా, మిమ్మును ఎవడు భ్రమపెట్టెను? సిలువ వేయబడిన వాడైనట్లుగా యేసుక్రీస్తు మీ కన్నుల యెదుట ప్రదర్శింపబడెను గదా" (గలతీ 3:1).

పక్షులను తిను పాములకు అందమైన ప్రకాశించు కన్నులుండును. పక్షులు ఎగురుచున్నప్పుడు ఈ పాములు తలలు పైకెత్తి కదలకుండ యుండును. ఆ మెరిసే కన్నులద్వారా ఆకర్షింపబడిన పిట్టలు దగ్గరకు రాగానే, ఈ పాములు వాటిమీద పడి, వాటిని చుట్టివేసి, ఎముకలను నలిచేసి చంపివేయును. ఈ పిట్టలు పాములద్వారా ఎట్లు మోసగింపబడెనో అట్లే తప్పుడు సిద్ధాంతముల ద్వారా ఈ గలతీయులు మోసగింపబడిరి. సబ్బాతు నాచరించువారు ఎంతో మంచి వ్యక్తులుగా కనిపించెదరు. వారు మత్తుపానీయములు త్రాగరు, పొగత్రాగరు, పంది మాంసము కూడ తినరు. దశమ భాగములను క్రమముగా నిత్తురు. ఎక్కడకు వెళ్ళినను బైబిలును తీసికొని వెళ్ళెదరు. బాప్తిస్మము అనగా ముంచుట అనియే నమ్మెదరు. కనుక వారిని చూచినప్పుడు ప్రజలకు వారిపట్ల సదభిప్రాయము ఏర్పడును. వారి సిద్ధాంతములలో ఏమి తప్పు ఉన్నదని ఆశ్చర్యపడెదరు. అయితే వారు ప్రజలను దేవుని కృపలోనుండి తొలగించుటకై సంచరించు విషపూరిత సర్పములై యున్నారు. గలతీయులు ఆత్మలో సరిగా ప్రారంభించి, దేవుని కృపలో ఎదుగుచు తిరిగి శరీరానుసారముగా జీవించుటకు ఆరంభించిరని పౌలు చెప్పుచున్నాడు. దేవుని గ్రంథమును చదువుడి. పదే పదే మీతో చెప్పుచున్నాము. సబ్బాతు నాచరించువారి పత్రికలు, మ్యాగజైనులు, పుస్తకము లుండినట్లయిన వాటిని కాల్చివేయుడి. ఎందుకనగా అవి మిమ్మును అపవిత్రులుగా చేయును. మీ కుటుంబములను నాశనము చేయుటకై శత్రువు వాటిని వాడుకొనుచున్నాడు. దేవుడు మీ పాపములను క్షమించినప్పుడే, విశ్వాసము ద్వారా దేవుని యెదుట నీతిమంతులుగా చేయబడిరి.

సబ్బాతు నాచరించుట ద్వారా రక్షింపబడెదరని వీరు చెప్పుచున్నారు. వాక్యమును జాగ్రత్తగా గమనించుడి.

## సబ్బాతు - దాస్యమును జ్ఞాపకము చేయుచున్నది

దేవుడు సబ్బాతును ఎందుకిచ్చెనో, ఆయన ఉద్దేశమేమో దానినుండి మనమేల స్వతంత్రులము కావలెనో యిప్పుడు చూచెదము. "ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను, నీ కుమారుడైనను, నీ కుమార్తెయైనను, నీ దాసుడైనను, నీ దాసియైనను, నీ ఎద్దయినను, నీ గాడిదయైనను, నీ పశువులలో ఏదైనను, నీ యిండ్లలో నున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఎందుకంటె నీ వలె నీ దాసుడును, నీ దాసియును విశ్రమింపవలెను. నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడినుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వి.కాం. 5:14,15).

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలుగా యుండిన విషయమును జ్ఞాపకము చేసికొనుట కొరకే దేవుడు సబ్బాతును నియమించెను. వారు ఐగుప్తీయులకు బానిసలుగా యుండి యితర దేవతలను సేవించుచుండిన విషయము జ్ఞాపకము చేసికొనవలెనని దేవుడు సబ్బాతును నియమించెను. ప్రతి సబ్బాతునాడు వారి అవిధేయతను బట్టి వారు బానిసలుగా చేయబడిరనియు,

పాపబంధకములు వారి చేతులను, కాళ్ళను, నాలుకలను, చెవులను, కన్నులను, సమస్త శరీరమును బంధించెననియు జ్ఞాపకము చేసికొనిరి. ధర్మశాస్త్రము బలహీనమైనందున ఎవరును దానిద్వారా నీతిమంతులు కాలేరి. అందువలననే యేసుక్రీస్తు ప్రభువు మానవుడయ్యెను. ధర్మశాస్త్రముద్వారా దేవుడు కోరు నీతిని ప్రభువే నెరవేర్చెను.

"కాబట్టి ఇప్పుడు క్రీస్తు యేసు నందున్న వారికి ఏ శిక్షా విధియులేదు. క్రీస్తు యేసు నందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను. ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను. శరీరమునననుసరింపక ఆత్మననుసరించియే నడుచుకొను, మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విధి నెరవేర్చబడవలెనని పాప పరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను" (రోమా 8:1-4). మానవుడు దేనిని చేయలేకపోయెనో దానినే క్రీస్తు నెరవేర్చి మనలను దాస్యమునుండి విడిపించి స్వతంత్రులనుగా చేసెను. ఆయనే మన భారములను భరించెను; మన శిక్షను భరించెను, మనకొరకై శాపగ్రాహియై, శిక్షావిధిలోనికి వచ్చెను. కనుకనే మనము సంపూర్ణముగా స్వతంత్రులమై, నూతన నియమము క్రిందకు వచ్చితిమి. క్రీస్తు యేసునందు జీవమునిచ్చు నియమము క్రిందకు వచ్చితిమి. ఎవరైతే పాత నియమము క్రిందకు వచ్చెదరో, వారు పాప మరణముల నియమము క్రిందనే యుందురు.

సబ్బాతు నాచరించుట ద్వారా, ఇశ్రాయేలీయులు, కఠినమైన సేవ చేయించుకొనువారి క్రింద ఎట్లు బానిసలుగా యుండిరో

జ్ఞాపకముంచుకొనిరి. ఇప్పుడైతే ప్రభువు ఆ బంధకములన్నియు తెంచివేసి, దాస్యము నుండి విడిపించి మనకు నిజమైన నెమ్మది నిచ్చెను.

# కృపద్వారానే స్వాతంత్ర్యము, విశ్రాంతి

"ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంక నిలిచియుండగా, మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమోయని భయము కలిగియుందము. వారికి ప్రకటింపబడినట్లు మనకును సువార్త ప్రకటింపబడెను గాని వారు వినినవారితో విశ్వాసముగలవారై కలిసియుండలేదు, గనుక విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైన దాయెను. కాగా జగత్పునాది వేయబడినప్పుడే ఆయన కార్యములన్నియు సంపూర్తియై యున్నను ఈ విశ్రాంతిని గూర్చి - నేను కోపముతో ప్రమాణము చేసినట్లు వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు అని ఆయన చెప్పిన మాట అనుసరించి, విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము. మరియు దేవుడు ఏడవ దినమందు తన కార్యములన్నిటిని ముగించి విశ్రమించెను, అని ఏడవ దినమును గూర్చి, ఆయన ఒకచోట చెప్పియున్నాడు. ఇదియును గాక ఈ చోటుననే వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు అని చెప్పియున్నాడు. కాగా ఎవరో కొందరు విశ్రాంతిలో ప్రవేశించుదురను మాట నిశ్చయము గనుకను, ముందు సువార్త వినినవారు అవిధేయత చేత ప్రవేశింపలేదు గనుకను, నేడు మీరాయన మాట వినిన యెడల మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (హెబ్రీ 4:1-6).

ప్రభువు మనకిచ్చు పరిపూర్ణమైన సమాధానమే 'విశ్రాంతి'యై యున్నది, దాసత్వము సమాధానమును తీసివేయును. దేవుడు ఏడవ దినమున సంపూర్ణ సమాధానముతో విశ్రమించెను. మనము ఆ సమాధానములోనికే ప్రవేశించుచున్నాము. మన ప్రభువైన యేసుక్రీస్తు మత్తయి 11:28లో యిట్లు చెప్పెను. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకురండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును". మనము నీతిమంతులమగుట కొరకు ఏమియు చేయనవసరము లేదు. యేసుక్రీస్తు ప్రభువు మన కొరకు, మనకు బదులుగా తానే అపరాధ పరిహారార్థ బలిగాను సమాధాన బలిగాను నైవేద్య బలిగాను, అర్పించబడెననియు, మనకొరకై మరణించెననియు హృదయపూర్వకముగా నమ్మవలెను. ఆ విశ్వాసము ద్వారానే నీతిమంతుల మగుచున్నాము. ఆయనే మన బలి, సున్నతి, సబ్బాతునై యున్నాడు. మనము స్వతంత్రులము.

# సిలువ - సంపూర్ణకార్యము

"ఈ సంగతులు అలంకార రూపముగా చెప్పబడియున్నవి. ఈ స్త్రీలు రెండు నిబంధనలై యున్నారు. వాటిలో ఒకటి సీనాయి కొండ సంబంధమైనదై దాస్యములో ఉండుటకు పిల్లలు కనును; ఇది హాగరు. ఈ హాగరు అనునది అరేబియా దేశములో నున్న సీనాయి కొండయే. ప్రస్తుతమందున్న యెరూషలేము దాని పిల్లలతో కూడ దాస్యమందున్నది గనుక ఆ నిబంధన దానికి దీటయి యున్నది. అయితే పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది. అది మనకు తల్లి ఇందుకు - కనని గొడ్రాలా సంతోషించుము, ప్రసవవేదన పడని

దానా, బిగ్గరగా కేకలు వేయుము; ఏలయనగా పెనిమిటి గల దాని పిల్లల కంటె పెనిమిటి లేనిదాని పిల్లలు ఎక్కువమంది ఉన్నారు అని వ్రాయబడి యున్నది. సహోదరులారా, మనమును ఇస్సాకువలె వాగ్దానమునుబట్టి పుట్టిన కుమారులమై యున్నాము. అప్పుడు శరీరమును బట్టి పుట్టినవాడు ఆత్మనుబట్టి పుట్టిన వానిని ఏలాగు హింస పెట్టెనో యిప్పుడును అలాగే జరుగుచున్నది. ఇందును గూర్చి లేఖనమేమి చెప్పుచున్నది? దాసిని దాని కుమారుని వెళ్ళగొట్టుము, దాసి కుమారుడు స్వతంత్రురాలి కుమారునితో పాటు వారసుడై యుండడు. కాగా సహోదరులారా, మనము స్వతంత్రురాలి కుమారులమే గాని దాసి కుమారులము కాము" (గలతీ. 4:24-31).

సీనాయి కొండమీద యివ్వబడిన ధర్మశాస్త్రము దాస్యమును, బానిసత్వమును తీసికొనివచ్చెను. దాని వలన ప్రజలు నేరస్థులైరి. అయితే యిప్పుడు మనము నూతన నిబంధన క్రిందకు వచ్చితిమి. ఇష్మాయేలు అబ్రాహాము సంతానమైనప్పటికిని, అతడును, అతని తల్లియైన హాగరును అతని యింటిలో నుండి వెళ్ళగొట్టబడిరి. దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానములో వారికి పాలులేదు. అదేరీతిగా సున్నతి, సబ్బాతుల నాచరించుటద్వారా లేక ఎటువంటి మానవ యత్నములు చేయుట ద్వారా నీతిమంతులము కాలేము.

రోమను క్యాథలిక్కువారు కూడా యేసు ప్రభువు సిలువలో ముగించిన కార్యమునందు విశ్వాసముంచుటకు బదులుగా యాజకులు ఏర్పరచిన జపములను, ఆదివారము ఉదయమున లేక యితర దినములలో ఆచరించుట ద్వారా నీతిమంతులు కావలెనని కోరుచున్నారు. రోమను క్యాథలిక్కులవలెనే సబ్బాతు నాచరించు

వారు దేవుని స్వాస్థ్యములో పాలుపొందలేరు. ఎందుకనగా వారు దాస్యముక్రింద నుండుటకే యిష్టపడిరి. యేసు ప్రభువు సిలువలో రక్షణ కార్యమును ముగించెను. "సమాప్తమయ్యెను" అని ఆయన చెప్పినప్పుడు దేవుడు వారికి రక్షణ యిచ్చెను. అయితే వారు "సమాప్తము కాలేదు ప్రభువా, మేము ఏడవ దినము నాచరించువారము; రక్షణకు సబ్బాతు కూడ నుండవలెను" అని చెప్పుచున్నారు.

నీవు ఒక అందమైన కట్టడము నిర్మించితి వనుకొనుము. పని అంతయు ముగించిన తరువాత భవనము అందముగా కట్టబడిన పిమ్మట ఎవరైనను ఒక విరిగిపోయిన మంటికుండకు తారు పూసి దానిమీద కొన్ని వికారమైన బొమ్మలు గీచి భవన నిర్మాణ ముగింపుకొరకై దీనిని వాడుకొనుమని చెప్పినట్లయిన ఎట్లుండును? ఏడవ దినము నాచరించువారు కూడా రక్షణ కొరకై యిట్లే చేయుచున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు పాపము లేనివాడుగా యుండి, మనకొరకు పాపముగా చేయబడెను. మన పాపముల కొరకైన శిక్షను ఆయనే భరించి మనకొరకై శాపగ్రాహి ఆయెను. ఆయన మన కొరకై సిలువలో చనిపోయెను. అందువలననే సమాప్తమయ్యెనని చెప్పగలము. రక్షణ కార్యము ముగించబడెనని కేవలము విశ్వాసముంచవలెను.

# నూతన నిబంధన

"సహోదరులారా, మనుష్యుడు బ్రతికినంతకాలమే ధర్మశాస్త్ర మతని మీద ప్రభుత్వము చేయుచున్నదని మీకు తెలియదా? ధర్మశాస్త్రము ఎరిగిన మీతో మాటలాడుచున్నాను. భర్త గల స్త్రీ భర్త బ్రతికియున్నంతవరకే ధర్మశాస్త్రము వలన అతనికి బద్ధురాలు గాని,

భర్త చనిపోయిన యెడల భర్త విషయమైన ధర్మశాస్త్రము నుండి ఆమె విడుదల పొందును. కాబట్టి భర్త బ్రతికియుండగా ఆమె వేరొక పురుషుని చేరిన యెడల వ్యభిచారిణి యనబడును గాని, భర్త చనిపోయిన యెడల ఆమె ధర్మశాస్త్రము నుండి విడుదల పొందెను గనుక వేరొక పురుషుని వివాహము చేసికొనినను వ్యభిచారిణి కాక పోవును'' (రోమా 7:1-3).

భర్త బ్రదికియున్నప్పుడు స్త్రీ వేరొక భర్తను వివాహ మాడినట్లయిన ఆమె వ్యభిచారిణి యగును. అయితే ఆమె భర్త మరణించినట్లయిన ఆమె వేరొకని వివాహము చేసికొనవచ్చును. ధర్మశాస్త్రమే అట్లు చెప్పుచున్నది. ఇప్పుడు ధర్మశాస్త్ర నియమము మనయెడల చనిపోయినదిగా యున్నది. మనమీద దానికి ఎటువంటి హక్కు లేదు. ఇప్పుడు మనము నూతనమైన కృపానియమమునకు వివాహము చేయబడియున్నాము. ఒక వితంతువు తిరిగి వివాహము చేసికొనినదనుకొనుము. దాని తరువాత ఎవరైనను మొదటి భర్తయొక్క ఎముకలను తనకిచ్చి తనతో ఉంచుకొనుమని బలవంతము చేసిరనుకొనుడి. ఏ స్త్రీ యైనను తన యింటిలో భర్త యొక్క ఎముకలను ఉంచుకొనునా! ఆ స్త్రీ భర్త నుండి విడుదల నొందినదని పౌలు చెప్పుచున్నాడు. సబ్బాతు నాచరించువారు గృహములలోనికి చనిపోయిన వారి ఎముకలను తీసికొని వచ్చుచున్నారు. మనము పాత నియమమునకు చనిపోయి యున్నాము. నూతనమైన దేవుని కృపానియ మునకు వివాహము చేయబడియున్నాము. అట్లయితే తిరిగి దాస్యము నకు వెళ్ళుట ఏల? తప్పుడు సిద్ధాంతములను గూర్చి అపొస్తలుడైన పౌలు రోమాలోని దేవుని ప్రజలను తీవ్రముగా హెచ్చరించుచున్నాడు.

"ఇప్పుడైతే దేనిచేత నిర్బంధింపబడితిమో దాని విషయమై చనిపోయినవారమై, ధర్మశాస్త్రమునుండి విడుదల పొందితిమి గనుక మనము అక్షరానుసారమైన ప్రాచీన స్థితిగలవారము గాక ఆత్మానుసారమైన నవీన స్థితి గలవారమై సేవ చేయుచున్నాము" (రోమా7:6).

పాత నియమము నుండి విడిపింపబడిన వారమై ఆత్మ నియమము క్రిందకు వచ్చియున్నాము. అయితే పది ఆజ్ఞలను మనము ఏల వల్లించుచున్నాము అని మీరు ప్రశ్నించవచ్చును. అది శత్రువు యొక్క పన్నాగమై యున్నది; ఆదివారము ఉదయమున క్రైస్తవ గుళ్ళలో ప్రజలు లేచి నిలువబడి పది ఆజ్ఞలను, అపొస్తలుల సూత్రములను చిలుకలవలె వల్లించుట అలవాటైనది. వీటిని వల్లించవలయునని బైబిలులో ఎక్కడను చెప్పబడలేదు. మనము ఏ ఆజ్ఞ క్రిందను లేము, అయితే దేవుని కృప క్రిందనే యున్నాము. కృపద్వారా ఆత్మ మనలోనికి వచ్చినప్పుడు అప్రయత్నముగానే మనము దేవుని ప్రేమించి, సేవించెదము. మన పొరుగువారిని ప్రేమించుదుము, ధర్మశాస్త్రమును నెరవేర్చెదము కాని ఆజ్ఞలు, ప్రభువు ప్రార్థన, అపొస్తలుల సూత్రము వల్లించుటద్వారా కాదు. మనంతట మనమే ధర్మశాస్త్రమును నెరవేర్చలేము. అయితే యేసుక్రీస్తు ప్రభువు మనలో జీవించుట ద్వారా, ఆత్మద్వారా నడిపించబడుట ద్వారా, దేవుని నీతిని జరిగించగలము. పరిశుద్ధాత్మద్వారా ఎంత ఎక్కువగా నడిపించ బడెదమో, అంత ఎక్కువగా దైవ నియమములను పాటించగలము. ఆ రీతిగా మనము సీనాయి కొండకు గాక, సీయోను కొండకు వచ్చెదము.

# జీవముగల దేవుని పట్టణము

"స్పృశించి తెలిసికొనదగినట్టియు, మండుచున్నట్టియు కొండకును, అగ్నికిని, కారు మేఘమునకును, గాఢాంధకారమునకును, తుఫానుకును, బూరధ్వనికిని, మాటల ధ్వనికిని మీరు వచ్చియుండ లేదు. ఒక జంతువైనను ఆ కొండను తాకిన యెడల రాళ్ళతో కొట్టబడ వలెనని ఆజ్ఞాపించిన మాటకు వారు తాళలేక ఆ ధ్వని వినినవారు మరి ఏ మాటయు తమతో చెప్పవలదని బతిమాలుకొనిరి. మరియు ఆ దర్శనమెంతో భయంకరముగా ఉన్నందున మోషే - నేను మిక్కిలి భయపడి వణకుచున్నాననెను. ఇప్పుడైతే సీయోనను కొండకును జీవముగల దేవుని పట్టణమునకు, అనగా పరలోకపు యెరూషలేము నకును వేవేల కొలది దేవదూతల యొద్దకును... వచ్చియున్నారు" (హెబ్రీ 12:18-24).

సీనాయి కొండ దాస్యమును, భయమును తెచ్చెను. ధర్మశాస్త్రము ద్వారా ఎవరును నీతిమంతులు కాలేరు. ధర్మశాస్త్రము ద్వారా పాపము అనగా ఏమో ప్రజలు తెలిసికొనిరి. పాపముయొక్క భయంకరత్వమును తెలిసికొనుట ద్వారా వారి నోరులు మూయబడెను. క్రీస్తు దగ్గరకు నడిపించుటలో ధర్మశాస్త్రము బాలశిక్షకుడాయెను. అయితే యిప్పుడు మనము పరలోక పట్టణము, పరలోక యెరూషలేము అయిన సీయోను కొండకు వచ్చియున్నాము. మన పరలోకపు గురి అదే. మనము ఒక చెట్టుక్రిందనైనను, ఇటుకలతో లేక రాళ్ళతో కట్టబడిన

యిళ్ళలోనైనను, ఒక గుడారములోనైనను, ఒక నది ఒడ్డున కాని ఆకాశము క్రింద ఏ స్థలములోనైనను ఆరాధించవచ్చును. స్థలము ప్రాముఖ్యము కాదు. ప్రజల మధ్యలో నున్న ఆత్మయే ప్రాముఖ్యమైనది. మనము దేవుని సత్యముతో, ఆత్మతో ఆరాధించినప్పుడు, ఆయన సంతోషించును. ఆయనకు కట్టడము అవసరము లేదు. పరలోక పట్టణమును ఆయన కట్టుచున్నాడు. ఈ దినములలో అందమైన పెద్ద రాతికట్టడములను బట్టి ప్రజలు అతిశయించుచున్నారు గాని, యేసుక్రీస్తు ప్రభువు జీవము అక్కడలేదు.

తిరిగి దాస్యములోనికి వెళ్ళవద్దు. యేసుక్రీస్తు ప్రభువు నివసించుచున్న ఆ పరలోక పట్టణమును చూడుము. ఆయన మన పాపముల కొరకై ఉత్తరవాదిగా యున్నాడు. ఆయన రక్తము మనలను శుద్ధీకరించును. ఆయన దూతలయొక్క కాపుదల మనకుండును. పరిశుద్ధుల సహవాసము మనకు లభించును. నిజమైన ఏకత్వమును కలిగియుండెదము. మన ఆధిక్యత అదియే. ఎక్కడ అలవాటులు, పద్ధతులు, ఆచారములు యుండునో అక్కడ శత్రువు ప్రజల ఆనందమును, స్వాతంత్ర్యమును దొంగిలించును.

శత్రువు నిన్ను మోసగించ నీయకుము. ప్రభువు నిన్ను స్వతంత్రునిగా చేసియున్నాడు. దేవుని బిడ్డగా నీ స్వాతంత్ర్యమును అనుభవించుము. ఆత్మతో, సత్యముతో, ప్రభువును ఆరాధించుము. ఏవో పద్ధతులను అవలంబించుట ద్వారా తిరిగి దాస్యములోనికి వెళ్ళకుము. ఆత్మలో జీవించుము. నీవు తిరిగి జన్మించి

యుండవచ్చును, ప్రభువు బల్లలో పాలుపొందుచు యుండవచ్చును. అయితే నీ జీవితములో శత్రుత్వము, అసూయ కలిగియుండి క్రీస్తు జీవితము నీవు జీవించకపోయిన నీవు దాస్యమును, మరణమును తీసికొని వచ్చెదవు. దేవుని ఆత్మ ధారాళముగా పనిచేయవలెను. ప్రభువు ప్రతి దాస్యమునుండి మనలను విడిపించి స్వతంత్రులనుగా చేయునుగాక. వాక్య భాగములన్నియు జాగ్రత్తగా చదివి ధర్మశాస్త్రము అనగా ఏమో, కృప అనగా ఏమో గ్రహించుము. దేవుడు చెప్పినదానికి లోబడుము.

* * *